


# గాలి దోషం

''గాలిలో ఎగురుతున్నట్లు ఎప్పుడేనా కలగన్నావా?'' మిడతంభొట్లు భార్యని అడిగేరు.

''ఊహు'' అని పరాగ్గా రాధ సమాధానం. కారం పెట్టి కూర వండడానికి గుత్తి వంకాయలు తరుగుతూన్న రాధకి భర్త వేసిన చొప్పదంటు ప్రశ్నకి అంత కంటె విపులంగా సమాధానం చెప్పవలసిన అవసరం కనిపించ లేదు.

''అది కాదు రాధా! ప్రతి వాడు గాలిలో ఎగరాలని కలలు కంటాడు. విమానంలో కూర్చుని ఎగరడం మాట కాదు నేను చెప్పేది. నిజంగా లఘుయానం. అనగా, అమాంతం గాలిలోకి తేలిపోగలగడం గురించి నేను చెబుతూంట. లియనార్డో డ వించి రోజుల నుండి ఇటువంటి కోరికలు మానవుడి మస్తిష్కంలో మెరుస్తూనే ఉన్నాయి.'' అని విశదీకరించేరు ప్రొఫెసర్ మిడతంభొట్లు.

మిడతంభొట్లు అసలు పేరు చాల మందికి తెలియదు. 'చెంబు గారు', 'గొట్టం గాడు' లా ఆంధ్రదేశంలో చెలామణీ అవుతూన్న 'గౌరవ' నామాలలో ఇదొకటి.

''ఇంటికొచ్చింది మొదలు ఒకటే గొడవ. పోయి పత్రిక చదువుకుందురూ,'' తరిగిన వంకాయలని నీళ్లల్లో పడేస్తూ విసుక్కుంది రాధ.

అంత సులభంగా వదలి పెట్టే రకం అయితే మిడతంభొట్లు అంత చిన్న వయస్సులోనే ప్రొఫెసరు అయేవాడా? ఆంధ్రదేశంలో ఎక్కడో 'లెక్చరరు' గానో, 'రీడరు' గానో 'రాట'వుతూ ఉండే వాడు. మిడతంభొట్లు ఇంట గెలిచిన తర్వాతే రచ్చ గెలిచేడు.

''గాలిలో తేలిపోవడం అంటే ఏమిటనుకున్నావు? రెక్కలు లేకుండా, యంత్ర సహాయం లేకుండా, ఇంద్రజాలం చెయ్యకుండా ఎప్పుడేనా గాలిలో తేలిపోయావా? అలా.. 'చల్ల గాలిలో ... మెల్ల మెల్లగా... తేలి పోదాం పదరా' అని పాట పాడుకుంటూ గాలిలోకి తేలిపోవాలన్న కోరికైనా పుట్ట లేదా నీకు?''

''లేకేమి. పెళ్లి కాక పూర్వం సముద్రపుటొడ్డుకి షికారుకి వెళ్లి, భవిష్యత్తుని తలుచుకుంటూ, అలా.. అలా.. ఊహాలోకంలో తేలిపోతూ చీకూ చింతా లేకుండా గాలిమేడలు కట్టుకుని ప్రయాణం చేస్తూ ఉంటే, గుది బండలా మిమ్మల్ని నా మెడకేసి కట్టేసి నా ప్రయాణాలని భూస్థాపితం చేసేసేరు మా పెద్దవాళ్లు'' అంటూ రాధ కత్తిపీట దగ్గర నుండి లేచింది.

రాధ మాటలలోని వెటకారం మేష్టారు గమనించక పోలేదు. ఏ పెళ్లాం ఏ మగ వాడిని ఇంత కంటె గౌరవంగా చూసింది, రాధ తన మాటలు లెక్క చేయలేదని బాధ పడడానికి? చేతిలొ ఉన్న పత్రికని నేలకేసి కొట్టేరు మిడతంభొట్లు.

''అది కాదండీ! ఎగురుతూ ఉన్నట్లు నేనూ కల గన్నాను. కల కల్ల అవుతుంది కాని నిజం ఎలాగవుతుంది? ఒక సారి మంతావారి మేడమీద ఉన్న బట్టల దండెం మీదకి వెళ్లి వాలినట్లు కల వచ్చింది. ఎవరేనా చూస్తున్నారేమోనని నేను సిగ్గుతో చచ్చిపోయా అనుకొండి. అదేమిటో శరీరం అంతా దూది పింజలా తేలిపోయి గాలిలో అలా తేలుతూ వెళ్లిపోయాను.''

''చూశావా? చూశావా!! ఇలాంటి కల రావడానికి కారణం ఏమిటని ఎప్పుడేనా ఆలోచించేవా?'' దొరకిన సదవకాశాన్ని దుర్వినియోగం చెయ్య తలుచుకో లేదు మిడతంభొట్లు. ''రాధా, అసలు కల అంటే ఏమిటో తెలుసా? మనం నిద్ర పోతూన్నప్పుడు మనమెదడులోని నాడీ మండలానికి ఏదో అవ్యక్తమైన ప్రేరేపణ జరిగిందనుకుందాం. ఈ ప్రేరేపణ లిప్త మాత్రపు కాలంలో సుషుప్తావస్థలో ఉన్న మన మనోవీధిలో సందర్భోచితమైన దృశ్యాన్ని సృష్టిస్తుందిట. అది కల రూపంలో సాక్షాత్కరిస్తుందిట.''

తన ఎడమ చెయ్యిని మేష్టారి నుదిటి మీద ఉంచి, ''మీ వరస నాకేమీ అర్థం కావడం లేదు. మీ మేష్టర్లు అంతా ఎంత చెప్పినా వినకుండా రోజూ ఆ చింత చెట్టు కింద కూర్చుని చదరంగం ఆడతారాయిను. ఒళ్లు వెచ్చగా లేదే! గాలిదోషమో ఏమిటో? సిద్ధాంతి గారిని పిలిపిస్తాను. ఆయన ఒక్క సారి చూసి పోతే నాకూ స్థిమితంగా ఉంటుంది.'' పీటలు వాల్చి, కంచాలు పెడుతూన్న రాధ నిజంగానే ఆతృత పడసాగింది.

''గోమూత్రం, నిమ్మకాయ రసం, రుద్రజడాకు పసరు కలిపి దానిని తేనెతో రంగరించి పుచ్చుకోమన్నావు కాదు. ఇంకా నయం. మా నాన్నగారు దగ్గరుంటే, నీ మాటలు నమ్మి 'లేఖసిస్ 200' గంటకి మూడు మాత్రల చొప్పున వేసేసి తన హొమియోపతీ వైద్యం తడాఖా చూపించేద్దురు. రాధా, ఒక సారి ఏమిటి జరిగిందో చెపితే నువ్వు నమ్మవు!''

''నమ్మక పోయినా నమ్మక పోవచ్చు. కానీ చెప్పండి. నేను ఒద్దంటే మీరు మానుతారా ఏమైనానా?''

''మెడ్రాసులో ఒక సారి భౌతిక శాస్త్ర పండితుల సదస్సు అయితే వెళ్లేను. దాశప్రకాష్ హొటేల్లో బస.....''

''నాతో పొలం పనిమీద పెంటకోట వెళతానని చెప్పి, మీరు నాకు తెలియకుండా మెడ్రాసు వెళ్లేరా? బుద్ధి పోనిచ్చుకున్నారు కారు. గాలిదోషం పట్టిందంటే పట్టదూ?''

''ఆగు, రాధా! ఆగు. పెంటకోటలో సముద్రం ఉంది, పొలాలు లేవు. ఆ విషయం అటుంచి, నేను చెప్పేది కడితేరా విను. ఎక్కడ ఉన్నాం? దాశప్రకాష్హొటేలు. అకస్మాత్తుగా హొటేలుకి నిప్పంటుకుంది. పెద్ద గందరగోళం, పరుగులు, కేకలు. అందరూ తప్పించుకుని పారిపోయినట్లు ఉన్నారు. నేనొక్కడినే గదిలో బందీని అయిపోయాను. గదిలో పొగ కమ్ముకు పోతున్నాది. ఏ తలుపు తీద్దామన్నా తెరుచుకోదు. వేడికి అనుకుంటాను, అన్ని తలుపులు బిగుసుకు పోయాయి. నాకు చెమటలు పోసేస్తున్నాయి. ...''

''అదేమండీ, ఇన్నాళ్లూ నాకు ఎందుకు చెప్పలేదు?''

"చెప్పనీ, రాధా. చెమటలు పోసేస్తున్నాయని కాదూ చేప్పేను. నా ఆర్తనాదం ఎవ్వరూ వినిపించుకో లేదు. ఈ లోగా అగ్నిమాపక దళాలు గణ గణ గంట వాయించుకుంటూ వస్తూన్న శబ్దం వినిపించింది. అమ్మయ్య, ఎవరో ఒకరు రక్షించక మానరని ధైర్య పడుతున్నాను. రాను రాను గంటల శబ్దానికి చెవులు గింగుర్లెత్తి పోతున్నాయి. మంచం పక్కనున్న అలారం గడియారం ధ్వనిలో ఆ గంటల ధ్వని కలసి పోయింది. మెలుకువ వచ్చేసింది." చేతులు కంచంలో కడుక్కుంటూ అన్నారు.

"నమ్మబుల్ గానే ఉందని నేనంటే మీరు నమ్ముతారా?"

"వెటకారం చెయ్యకు రాధా! ఇక్కడ గమనించ వలసిన విషయం ఏమిటో తెలుసా? కనీసం పది నిమిషాల పాటైనా ఈ కల కని ఉంటానని నా అనుమానం. పది నిమిషాలు కాకపోయినా ఆ మంటలు, ఆ అతృత, ఆ కంగారులో పది నిమిషాలలా అనిపించింది. ఆ కల అయిపోతూన్న ఆఖరు క్షణాలలో కదా అగ్నిమాపక దళాల వారు రావడం, గంటలు వాయించడం జరిగింది. అదే వేళకి అలారం కూడ గంట కొట్టిందంటే ఆశ్చర్యంగా లేదూ?

"అసలు అలారం ఎప్పుడు కొడుతుందో కలకి ముందుగా తెలియదు కదా. నిజానికి గడియారం చప్పుడు చేసే వరకు గాఢ నిద్రలో ఉంటాం. నిజమైన గాఢ నిద్రలో అసలు కలలు రావు. అలారం కొట్టిన ఉత్తర క్షణంలో గాఢ నిద్ర కాస్తా భంగం అయి మామూలు నిద్రగా మారుతుంది. ఈ మామూలు నిద్రలోనే మనం కలలు కంటాం. ఇంకా గడియారం చప్పుడు చేస్తున్నాది కనుక మరొక లిప్త మాత్రపు వ్యవధిలో మనకి మెలుకువ వచ్చేస్తుంది. కనుక మన గడియారం గంటలు కొట్టడం మొదలు పెట్టిన తర్వాత, నాకు మెలుకువ రావడానికి ముందు మధ్యనున్న అత్యల్ప వ్యవధిలో నేను మెడ్రాసు వెళ్లినట్టు, హొటేలుకి నిప్పంటుకున్నట్టు ఒక కథ అల్లి, అకస్మాత్తుగా వచ్చిన అలారం చప్పుడుకి నా మెదడు ఒక అర్ధాన్ని కల్పించింది అన్నమాట." పక్క మీద నడ్డి వాల్చి చదువుకుందుకని పుస్తకం పట్టుకుంటూ కథ ముగించేరు మిడతంభొట్లు.

దంతధావనం పూర్తి చేసుకుని, కాఫీ కుంపటి దగ్గర పీట మీద కూర్చుని కాఫీ తాగుతూ,

"అద్దదీ! అర్థం అయింది. వాతప్లవనం! దీనినే ఇంగ్లీషులో 'లెవిటేషన్' అంటారు. స్వతహాగా నీళ్లల్లో మునిగిపోయే మానవుడు శవాసనం వేసి తేలడం లేదూ? అలాగే ఈ భూమి చుట్టూ ఉన్న వాతావరణం అనబడే గాలి సముద్రపు అడుగున ఉన్న మనిషి గాలిలోకిఎందుకు తేల కూడదు? నీటిలో తేలి నట్లే గాలిలో తేలడం! ఇది సాధ్యమేనా? పద్మపాదాచార్యులవారు నీటి మీద తేలుతూ నడిచేరని చరిత్ర చెబుతోందే. ఆయన పాదాలకి అడుగున పద్మాలు మొలిచేయనీ, అవే ఆయన మనిగి పోకుండా కాసేయనీ అంటారు....."

మేష్టారి వాలకం చూసి రాధ నిజంగా కంగారు పడుతూ ఉంటే ఆయన అదేమీ పట్టించుకున్నట్టు లేదు.

''....రాధా! రాత్రి నిద్ర నుండి లేచే సరికి మిద్దీ మీద నుండి కిందనున్న మంచం మీదకి పడ్డట్టు అనిపించింది. అసలు రాత్రల్లా వాయు యానం చేస్తూనట్లే అనిపించింది. కలో? నిజమో? వైష్ణవ మాయో? లేక, కలే నిజమయిందో? అంతా అయోమయంగా ఉందనుకో. ప్రతి క్షణం క్షుణ్ణంగా వర్ణించి చెప్ప గలను. చల్లటి గాలి వీస్తోంది. ఆకాశం నిండా శ్రావణ మేఘాలు దట్టంగా అలుముకుని ఉన్నాయి. నేనేమో గాలి కెరటాలలో తేలుతూ, నారదుల వారిలా ప్రయాణం చేస్తూ చుట్టూ చూద్దును కదా? అది కల కాదు. పచ్చి నిజం. ఇంటి కప్పుకున్న వాసాలు చేతికి తగిలేయి! మంచం కోళ్లు ఎదిగి పోయాయో ఏమిటో అని కంగారు పడుతూ పరుపుని చేతులతో తడిమి చూసేను. వీపు కింద పరుపు లేదు. అసలు నేను మంచంమీద లేనే లేను. నా వీపుకీ మంచం మీదున్న పరుపుకీ మధ్య కనీసం పదడుగుల జాగా ఉంది. పక్కకి ఒత్తిగిల్లి చూసేను. ఒక్క కండరం శ్రమించకుండా ఇచ్ఛామాత్రంగా ఒత్తిగిల్ల గలిగేను. ఒక్క సారి గుండె గుభేలు మంది. వెంటనే పదడుగుల ఎత్తు నుండి కిందనున్న పరుపు మీదకి దభి మని పడ్డాను.''

''బావుంది, మీ వరస! బాం...!! మీ ఆటలు ఇక నా దగ్గర సాగవు. ఇంత సేపూ నేనేదో వెర్రిమాలోకంలా మీ మాటలన్నీ కళ్లప్పగించి వింటున్నాను. ఇహ వేళాకోళాలు కట్టిపెట్టండి. మీరు కథల పోటీకి కథ రాస్తున్నారు. మీకు తట్టిన ఊహాలన్నిటిని నా మీద ప్రయోగిస్తున్నారు.''

''రాధా! ఇదేమీ కాకమ్మ కథ కాదు. కథల పోటీ అంత కంటె కాదు.''

''కాక పోతే ఏమిటండీ! నేనూ కలలు కన్నాను. ఒకసారి కలలో ఉప కల. ఎంత గాభరా పడ్డానో మీకేం తెలుసు. కాని ఊళ్లో వాళ్లందరినీ కంగారు పెట్టిసేనా?''

''జరిగింది మాత్రం నిజం. నమ్ము, నమ్మకపో.''

''ఫిజిక్సు మేష్టారూ! మనం ఈ భూమి మీద ఉన్నాం. ఈ భూమికి ఆకర్షణ శక్తి ఉందని మీకు నేను చెప్పక్కర లేదు. కనుక గాలిలో అమాంతం అలా తేలిపోవడం అసంభవం. ఇప్పటికేనా మీ సోది ఆపండి. ఎవరేనా వింటే వెర్రో, పిచ్చో అనుకుంటారు.''

''అహాహా. ఇప్పుడొచ్చిన చిక్కల్లా అక్కడే. నాకూ నమ్మాలని లేదు. మరొక సందర్భంలో అయితే నేనూ నమ్మేవాడిని కాను. కాని నమ్మవలసిన అవసరం వచ్చింది. నా ఈ అనుభవానికి శాస్త్ర సమ్మతమైన విపులీకరణ ఏదైనా ఉంటుందేమో పుస్తకాలలో వెతుకుదామని యూనివర్సిటీ లోని గ్రంథాలయానికి వెళ్లేను. కింద అరలు అన్నీ వెతకి, పై అరలో ఉన్న పుస్తకాలు కూడా చూద్దామని ఒక్కసారి లేచేను. అంతే! ఒక్క సారి కళ్లు చీకట్లు కమ్మినట్లు అయింది. కూర్చున్న మనిషి గభిమని లేచి నిలబడితే కళ్లు చీకట్లు కమ్మడంలో వింతేమీ లేదు. కాని కళ్లు విప్పి చూద్దును కదా. అమాంతం మాయాబజారు సినిమాలో ఘటోత్కచుడిలా పైకి

తేలిపోయాను. కావలసిన పుస్తకం కళ్లకి ఎదురుగా ఉంది కాని కాళ్లు నేల మీద లేవు. ఏదో పైత్యం చేసిందని.....''

''అమ్మా! ఈ రోజు సప్తమీ బుధవారం. మృగశిర ఘడియలు సాయంకాలం నాలుగు గంటల వరకు. అమ్మా! రాధమ్మా!! ఏమిటి చిన్నబాబుకి అస్వస్థతగా ఉందని కబురు పెట్టావు?'' అంటూ అవధాని గారు లోపలికి రానే వచ్చారు. వస్తూనే దేవుడి గదిలోకి వెళ్లి, నేల మీద యంత్రం వేసి, ఓం, హ్రీం, హ్రూం... అంటూ మంత్రాలు చదవడం మొదలు పెట్టేరు.

''మీ అందరికీ మతులు పోయి ఉండాలి. ఇంత బతుకూ బతికి ఇంటెనక్కాల చచ్చినట్లు, భౌతిక శాస్త్రం అవుపోశన పట్టేసిన నేను భూతాలన్నా, దయ్యాలన్నా, చెడుపు, చిల్లంగీ అన్నా నమ్ముతానా?''

మిడతంభొట్లు మేష్టారి గొడవ పట్టించుకునే ధ్యాసలో లేరు అవధాని గారు.

''...గోవిందా, విష్ణవే, మధుసూదనా, త్రివిక్రమా...అమ్మాయీ, మన చిరంజీవి జాతకం ఇలా పట్రామ్మా.. వామనాయ నమః, శ్రీధరా, హృషీకేశా,...., జపాకుసుమ సంకాశం, కాశ్యపేయం మహాద్యుతిమ్, హ్రీం, హ్రూం... , డుర్..'' అంటూ అవధాని గారు మంత్రాలు, పూజ సామగ్రి కావాలంటూ ఆదేశాలూ ఒకే గుక్కలో వల్లిస్తూ, మధ్యలో ఒక గాట్టి పొడుం పట్టు లాగించేరు.

''దీన్నే మనవాళ్లు అష్టావధానం అంటారు కాబోలు!'' అని అవధాని గారిని మిడతంభొట్లు ఎగతాళి చెయ్యబోతే రాధ రుస రుస లాడుతూ ఆయనని వారించింది.

''పంచమాధిపతి అయిన రవి తృతీయ షష్ఠాధిపతి అయిన బుధుణ్ణి వక్ర దృష్టితో చూడడం వల్లనూ, శత్రు స్థానమందు చంద్రుడుండి, గురునిచే చూడబడుట చేతనున్నూ, జాతకుడికి మనో చలనానికి...''

ఢాంమ్మని తలుపు చేసిన చప్పుడు చందాన్ని బట్టి మిడతంభొట్లు కోపంతో బయటకు నిష్క్రమించేరని సూక్ష్మగ్రాహి అయిన ఆయన సహధర్మచారిణి అర్థం చేసుకుంది.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ భౌతిక శాస్త్ర సమ్మేళనం జరగబోతూందన్న వార్త చెవిని పడే సరికల్లా మిడతంభొట్లు మనస్సు ఎగిరి గంతేసింది. ఈ మహదవకాశాన్ని సద్వినియోగం చేసుకుందామని ఎంతో ఆరాటంతో సమావేశం కార్యదర్శి సుదర్శనంగారి దర్శనం చేసుకున్నాడు మిడతంభొట్లు. ఊపిరి తిరగని పనులతో సతమతమవుతూ, ఒక చెవితో సుదర్శనం గారు మిడతంభొట్లు కథనాన్ని విన్నారు. విని,

''మేష్టారూ! సమావేశపు ఆఖరు రోజున అతిధులందరి గౌరవార్థం 'ఎంటర్‌టెయిన్‌మెంట్' ఉంటుంది. ఆ వ్యవహారం అంతా చిదంబరం గారు చూస్తున్నారు. కదంబ కార్యక్రమంలో తప్పకుండా మీకు ఛాన్సు ఇస్తారు, వెళ్లి నేను చెప్పేనని చెప్పండి'' అని చెప్పి ఆయన పనులలో ఆయన మునిగి పోయారు.

మిడతంభొట్లు అహం దెబ్బ తింది. 'ఈ దూషణ భూషణములు ఈ శరీరమునకే కాని ఆత్మకి చెంద నేరవు' అని సమర్ధించుకుని, కార్యసూరుడు కావడం మూలాన్న తక్షణ కర్తవ్యం ఏమిటా అని ఆలోచిస్తూ సుదర్శనం సమక్షం నుండి తప్పుకున్నారు.

సాయం సమయం. నేపథ్యంలో యవనికలా కనిపిస్తూన్న నీలిరంగు సముద్రం మీద నుండి చల్లటి గాలి వీచుతోంది. పగలంతా భౌతిక శాస్త్రపు లోతుపాతులని శల్యపరీక్ష చేసి అతలాకుతలం అయిపోయిన అంతర్జాతీయ నిష్ణాతులందరూ సేద తీర్చుకునే నిమిత్తం బయటనున్న పచ్చిక బీడులో సమావేశం అయేరు. విజ్ఞాన పిపాస ఇంకా తీరని వాళ్లు పానీయాలని చప్పరిస్తూనే తీవ్రంగా చర్చలు కొనసాగిస్తున్నారు. విదేశాలనుండి వచ్చిన అతిథుల సత్కారానికి గాను ఆంధ్రప్రదేష్ ప్రభుత్వం వారు ఆ మూడు రోజులతో పాటు ఆంధ్రవిశ్వవిద్యాలయపు సరిహద్దులలో మాత్రం చెలామణీ అయే విధంగా మద్యనిషేధపు చట్టాన్ని కొద్దిగా సడలించేరేమో, భౌతిక పిపాస తీరని పురప్రముఖులు కొందరు ఆహూతుల మధ్యలో కలసిపోయి అప్పనంగా దొరకిన 'అమృతాన్ని' అవుపోశన పట్టెస్తున్నారు. గంట సేపే కాక్‌టెయిల్ పార్టీ. తర్వాత భోజన కార్యక్రమం, కదంబ కార్యక్రమం.

అల్లంత దూరంలో రష్యానుండి వచ్చిన పిసరెంకో గారు, జర్మనీ నుండి తరలి వెళ్లి అమెరికాలో స్థిరపడిపోయిన 'అమెరికన్' ప్రొఫెసర్ ఎబర్‌హార్టు గారు అయిన్‌స్టయిన్ ప్రతిపాదించిన సాధారణ గురుత్వాకర్షణ సిద్ధాంతం మీద లొబచెవ్‌స్కీ క్షేత్రగణితపు ప్రభావం ఏమిటా అని తీవ్రంగా చర్చిస్తున్నారు.

"హల్లో ప్రొఫెసర్ ఎబర్‌హార్ట్! జ్ద్రాస్త్వీతి, ఎకడమీషియన్ పిసరెంకో" అని పొల్లు పోని ఇంగ్లీషు, రష్యన్ భాషలలో ఇద్దరినీ పలకరించి, వారిరువురి సంభాషణలో ఉత్సాహం చూపిస్తూ మాట కలిపేరు మిడతంభొట్లు. తెల్లవాడు మెచ్చుకుంటే కాని సాటి నల్లవాడి మెప్పు పొందడం దరిదాపుగా అసంభవం అని మిడతంభొట్లు గారు పచ్చి అనుభవం మీద తెలుసుకున్న నగ్న సత్యం. భోజన కార్యక్రమాదులు మొదలయే లోగానే తన గోడు పెద్దవాళ్ల చెవిని పడేయాలన్న ఉత్కంఠతో తహతహ లాడుతూన్న మిడతంభొట్లుకి ఈ సదవకాశాన్ని విడుచుకోవడంలో ఏమంత విజ్ఞత కనిపించలేదు. అందుకని గురుత్వాకర్షణ సిద్ధాంతం మీద జరుగుతూన్న చర్చని నాస్తిగురుత్వం, బరువు, భారం మొదలయిన విషయాల మీదకి మళ్లించేడు. మళ్లించి తన అనుభవాలని వాళ్ల చెవిలో ఊదేశాడు.

మిడతంభొట్లు గుక్క తిప్పుకోకుండా చెప్పిన కథనాన్ని ఊపిరి బిగపట్టుకుని విన్నారు అతిథులిద్దరూ. రెండు నిమిషాల పాటు ఒక రకం బరువైన నిశ్శబ్దం వాతావరణంలోకి దిగింది.

"మీ మాటలు వింటూ ఉంటే ఆడబోయిన తీర్థం ఎదురయినట్లు అయింది," అన్నారు రష్యన్ భాషలో సామెతలు చెప్పడంలో దిట్టయిన ప్రొఫెసర్ పిసరెంకో.

''మీ అనుభవాలని మేము కూడ పంచుకోడానికి వీలవుతుందా? లేక యోగంలో లా ఎవరి అనుభవాలు వారివేనా?'' అని ఎబర్‌హార్ట్ వంత పాడేరు.

మిడతంభొట్లు గుప్తంగా పంట్లాము జేబులో దాచి పెట్టిన వీశ రాళ్లని బయట పడేశారు. పిసరెంకో, ఎబర్‌హార్ట్ మేష్టారి వాలకం కళ్లప్పగించి చూస్తున్నారు. మిడతంభొట్లు రెండడుగులు వెనక్కి వేసి ఆ పక్కన ఉన్న ఒక చెట్టు కొమ్మ దగ్గరకి వెళ్లి, కొమ్మ కొసన ఉన్న కాయని అందుకుంటున్నట్లు కాళ్లు సాగదీశారు. అమాంతం గాలిలోకి తేలిపోయిన మిడతంభొట్లుని చూసి నిశ్చేష్టులై, నిర్విణ్ణులై, మాటా మంతీ లేకుండా అలా ఒక నిమిషంపాటు ఉండిపోయారు. మిడతంభొట్లు మేష్టారు నేలకి పదడుగుల పైకి లేచి పోయి, చిటారు కొమ్మ చివర అలా ఒక నిమిషం పాటు శ్రమించకుండా `నిలబడ' గలిగేరు. తర్వాత నెమ్మదిగా నేల మట్టం మీదకి వచ్చేరు.

ఎబర్‌హార్టు గారు ఇదివరలో భారతదేశం వచ్చినప్పుడు మోళీ కట్టడం చూసేరు. రాబోయే కదంబ కార్యక్రమంలో ఇది ఒక `నాంది అంశం' ఏమో అని ఆయనకి ఒక చిన్న అనుమానం పట్టుకుంది. కాని వ్యక్తి గతంగా కాకపోయినా ప్రచురించిన పరిశోధనా పత్రాల ద్వారా మిడతంభొట్లు ఆయనకి చిర పరిచితులు కనుక ఆయన ఇటువంటి `మోసం' చెయ్యడానికి అవకాశం తక్కువ. అయినా వేళాకోళానికో, పరిహాసానికో, వినోదానికో శాస్త్రవేత్తలు ఇటువంటి ప్రయోగాత్మక పరిహాస చేష్టలు చెయ్యడంలో దిట్టలే. కనుక ఎబర్‌హార్టు గారికి ఇందులో ఉన్న భేతాళ రహస్యం ఏమిటో తెలుసుకోవాలన్న కతూహలం పెరిగింది. అందుకని తన ముఖ కళవళికలలో తన మనో భావం ప్రస్ఫుటమవకుండా జాగ్రత పడుతూ సంభాషణ కొనసాగించేరు.

ఇటువంటి విశేషమైన విశేషానికి తార్కిక మైన కారణం ఏమై ఉంటుందా అని చాల పెద్ద ఎత్తున ఆ చెట్టు కింద చర్చలు జరిగేయి.

''భూమికి ఆకర్షణ శక్తి నశించి ఉండాలి'' అన్నారు త్రిమూర్తులలో ఒకరు.

''అలా అయితే మిడతంభొట్లుతో పాటు మిగిలిన ఇద్దరూ కూడ తేలిపోయి ఉండాలే'' అని ధర్మ సందేహం వెలిబుచ్చి, ''అసలు భూమి ఆకర్షణ శక్తి నశించి ఉంటే సూర్యుడి చుట్టూ భూమి తన కక్ష్యలో తను తిరగలేదే!'' అని ఆశ్చర్యం ప్రకటించేరు.

ఇలాగే ఎన్నో పిల్ల సిద్ధాంతాలు, పిచిక సిద్ధాంతాలు తిరగేసి చూసేరు. ఒక్క మిడతంభొట్లు మేష్టారికే ఈ అనుభవం కలుగుతున్నాది కనుక ఇదేదో ఆయన శరీరంలో మార్పు వల్లనే కాని బాహ్య ప్రపంచంలో మార్పు వల్ల కాదని తీర్మానించేరు.

''లేదా, మేష్టారి శరీరం చుట్టూ ఉన్న క్షేత్రంలో ఏదయినా మార్పు జరుగుతూ ఉండి ఉండాలి. ఉదాహరణకి. ఒక వ్యక్తి చుట్టూ ఉన్న గాలి చిక్కబడిందని అనుకుందాం. అప్పుడు ఆ అధిక సాంద్రత పొందిన గాలిలో వస్తువులు తేలిపోవడానికి సావకాశం ఉంది కదా?'' అని పిసరెంకో ఒక సిద్ధాంతాన్ని లేవదీసి, తన సిద్ధాంతాన్ని చులకన చేసి అమెరికన్

ప్రొఫెసరు నవ్వుతాడేమోనని భయపడి కాబోలు, ''అసలు, అమెరికాలో సాల్ట్ లేక్ సిటీ దగ్గర ఉన్న ఉప్పునీటి సరస్సులో నీటి సాంద్రత సముద్రపు నీటి సాంద్రత కంటె బాగా ఎక్కువ కావడం వలన ఆ సరస్సులో ఈత రాని వాళ్లు కూడ పాదరసం మీద గుండుసూదిలా తేలిపోతారుట'' అని చిన్న సమర్ధింపు వాక్యాన్ని జోడించేడు, ఎబర్‌హార్ట్ వైపు చూస్తూ.

''అటువంటప్పుడు మిడతంభొట్లు తక్షణ పరిసరాల్లో ఉన్న ఇతర వస్తువులు కూడ గాలిలో తేలిపోవాలి కద?'' అని ఎబర్‌హార్ట్ అన్నారు.

'నేను థర్మోడైనమిక్సు రెండవ సూత్రం మీద నా ఆశలన్నీ పెట్టుకుని ఉన్నాను'' అంటూ మిడతంభొట్లు స్వగతంగా అనుకున్నట్లు గొణిగేడు.

కాక్‌టెయిల్ పార్టీలలో కబుర్లు సగానికి పైగా గాలి కబుర్లే కనుక అతిధులిద్దరూ మిడతంభొట్లుని ప్రోత్సహించేరు.

''నీటితో నిండి, నిశ్చలంగా ఉన్న ఒక గాజు బుడ్డిలో ఒక సిరా చుక్క వేస్తే ఏమిటవుతుంది?'' మిడతంభొట్లు దొరికిన అవకాశాన్ని ఉపయోగించుకుంటూ తన సిద్ధాంతాన్ని లేవదియ్యడం మొదలు పెట్టేరు. ''కాలం గడిచిన కొద్దీ, సిరా నీటిలో నెమ్మదిగా కలసి పోతుంది. ఆ సిరా చారలు చారలుగా ప్రయాణం చేస్తూ నీటిలో కలసి పోయే వయనాన్ని మనం కళ్లారా చూడవచ్చు. అవునా? అంటే సిరా వేసిన చోట కుదురుగా ఉండకుండా క్రమం తప్పి చెదిరి పోతుంది. ప్రయత్నం చెయ్యకుండా, శక్తిని వెచ్చించ కుండా ఆ సిరా చుక్కని నీటి నుండి విడదీసి బయటకు లాగలేము. ఈ రకపు ప్రవర్తన సిరాబుడ్డిలో సిరాకే పరిమితం కాదు. ప్రపంచంలో దేనినైనా సరే నియమం, నిబంధన లేకుండా - కట్టడి, ఒత్తిడి లేకుండా - ఒదిలేస్తే దానిలో క్రమత్వం నశించి అక్రమత్వం ప్రభలుతుంది. ఉపాధ్యాయుడనే బాహ్యమయిన ఒత్తిడిని తీసేస్తే, విద్యార్థులు క్రమశిక్షణ లేకుండా అల్లరి చెయ్యరూ? యుగాలు గడుస్తూన్న కొద్దీ ఈ ప్రపంచంలో ధర్మం నశించి అధర్మం ప్రబలుతుందని భగవద్గీతలో మా కృష్ణుడు చెప్పనే చెప్పేడు. ఇది ప్రకృతి ధర్మం. దూరాన్ని కొలవడానికి అడుగులు, గజాలు వాడినట్లు, కాలాన్ని కొలవడానికి గంటలు, రోజులు వాడినట్లు, ఈ అక్రమత్వాన్ని కొలవడానికి 'ఎంట్రోపీ' అనే మాట వాడతాం కదా?''

అప్పటికే వీళ్ల సంభాషణ వింటూన్న ఆహూతులు కొందరు వీరి చుట్టూ మూగేరు. వారిలో సైన్సుని తెలుగులో రాయడానికి తాపత్రయ పడే పాత్రికేయుడు ఒకతను కలుగజేసుకుని, ''ఈ ఎంట్రోపీనే తెలుగులో 'అబంత్రం' అన్న మాటతో కాని 'యంతరపి' అన్న మాటతో కాని ఆంధ్రీకరిస్తున్నారండి, మన వాళ్లు.''

పిలవని పేరంటానికి అవకాశం ఇస్తే ఆషాఢభూతిలా పంచని చేరి వాసాలు లెక్క పెట్టే ప్రభృతుల సంగతి మిడతంభొట్లుకి తెలుసు. అందుకని, తన వాక్ ప్రవాహానికి ఎవరివల్లా అంతరాయం రాకూడదన్న దృఢ నిశ్చయంతో, ''కాలం గడుస్తూన్న కొద్దీ ఈ 'ఎంట్రోపీ' పెరుగుతుంది తప్ప తరగదని అందరికీ తెలుసు కదా'' అని తిరిగి అందుకున్నాడు.

మన పాత్రికేయుడు ప్రవాహానికి ఆటంకం ఎలాగూ కలిగించేడు కదా అన్న ధైర్యంతో ఉత్కంఠ భరించలేని ఒక విద్యార్థి మిడతంభొట్లు గారిని తొందర పెట్టడం మొదలు పెట్టేడు.

``నిర్జీవమైన భౌతిక ప్రపంచంలో `ఎంట్రోపీ` ఎల్లప్పుడు పెరుగుతూనే ఉంటుంది. `ఎంట్రోపీ` తగ్గిందంటే మనం బయటనుండి శక్తిని సరఫరా చెయ్యనేనా చెయ్యాలి లేదా కాలచక్రాన్ని వెనక్కి తిప్పనైనా తిప్పాలి. కాలాన్ని వెనక్కి నడిపించడం ఎలా అసంభవమో అలాగే `ఎంట్రోపీ` ని తగ్గించడం కూడ అని మనందరికీ తెలుసు. కాని జీవం ఉన్న పదార్థాలలో ఇది సాధ్యం. జీవన ప్రక్రియలలో గజిబిజిగా ఉన్న అక్రమత్వం నుండి పరిపూర్ణ సౌష్టవం, క్రమత్వం ఉన్న పదార్థం పుట్టడం లేదూ? తల్లి గర్భంలో పిండం నుండి పెరిగే శిశువే దీనికి ఉదాహరణ. తల్లి రక్తం నుండి నిరాకారమైన పోషక పదార్థాలని తీసుకుని వాటికి రూపం కల్గించే ప్రక్రియలో ఎంట్రోపీ తగ్గినట్లే కదా! ఇక్కడ కాల గమనాన్ని వెనక్కి మళ్లించ నక్కర లేకుండా ఎంట్రోపీ తగ్గించడం జరిగింది. ఇది తాపగతి శాస్త్రపు రెండవ సూత్రానికి విరుద్ధం.''

మిడతంభొట్లు ధోరణి ఎబర్‌హార్టు గారికి అర్థం కాక, ``సర్! మీరు చెప్పే సిద్ధాంతానికీ, మీరు గాలిలో తేలిపోయిన అనుభవానికి మధ్య సంబంధం ఏమిటో బోధ పడడం లేదు.''

``వస్తున్నా. తాపగతి శాస్త్రపు రెండవ సూత్రం వమ్ము అయినట్లు కనిపించడం ఇటువంటి ప్రత్యేకమయిన పరిస్థితులలోనే. భారీ ఎత్తున రెండవ సూత్రం అక్షరాలా వర్తిస్తుంది. సజీవ కాయం లోపల క్రమత్వం ఎక్కువ గనుకనున్నూ, బాహ్య ప్రపంచంలో కాలంతోపాటు క్రమత్వం తగ్గాలి కనుకనున్నూ, సజీవ కాయానికీ, నిర్జీవమైన భౌతిక ప్రపంచానికీ మధ్యనున్న ప్రహర వద్ద విచిత్రమైన సంఘటనలు జరగడానికి సావకాశాలు ఉన్నాయి.

``ఉదాహరణకు, నా శరీరంలో పదార్థం కొంత అకస్మాత్తుగా ఏష్యం అయిపోయిందని అనుకుందాం. పదార్థం నిహిత నియమాలకి లోబడి ఉంటుంది కనుక ఏష్యం అయిన పదార్థం శరీరంలో లేదు కనుక బాహ్య వాతావరణం లోనికి పోయి ఉండాలి, లేదా అయిన్‌స్టయిన్ సమీకరణం ప్రకారం శక్తిగా మారి పోవాలి. బాహ్య వాతావరణం లోనికే పోయి ఉంటే శరీరం చుట్టూ ఉన్న గాలి లోనికి అధికంగా పదార్థం చేరిందన్న మాటేగా? అప్పుడు శరీరం చుట్టూ ఉన్న గాలి సాంద్రత పెరుగుతుంది. జీలుగుబెండు నీటిలో తేలినట్లు సాంద్రత పెరిగిన గాలిలో నా శరీరం తేలిపోయి ఉంటుంది.''

``మీరు చెప్పిన సిద్ధాంతమే నిజమయితే తేలిపోయిన మనిషి మళ్లా కిందికి ఎలా రా గలిగేడు? ఇది, ఇది – ఆయనకి ఇంగ్లీషు మాట గభిమని తట్ట లేదు – `ఓబ్రతిమియా రియాక్సియ్` '', అని చిటికలు వెయ్యడం మొదలు పెట్టి, ``ఇది `రివర్సిబుల్ రియేక్షన్` అని మీకు నమ్మకమా?'' పిసరెంకో గారు చిన్న ధర్మ సందేహం వెలిబుచ్చేరు.

"ఇది నమ్మకంగా ఉత్క్రమణీయ ప్రతిక్రియే" – పిసరెంకో గారు రష్యన్ భాషలో మాట్లాడే సరికి మిడతంభొట్లు తెలుగులో లంకించుకుని, మరీ వేషాలు వేస్తే మర్యాదగా ఉండదనో ఏమో – "లేదా, 'రివర్సిబుల్ రియేక్షనే'. దీనిని ఎంట్రోపీతో సమన్వయం చెయ్యాలి. ఎంట్రోపీతో సమన్వయం చేసిన తర్వాత ..."

మంచి రసగంధాయంలో ఉన్న మిడతంభొట్లు గారి ఆలోచనా సరళికి అంతరాయం కలిగిస్తూ ఆయన కర్ణ కుహరాలలోకి అపస్వరంలా తెలుగు సంగీతం వినిపించ సాగింది.

"ఎంట్రోపీ, యంతరపీ, యంత....."

"ఏమండీ! ఏమండీ! ఏమిటా కలవరింతలు? లేవండి. పొద్దెక్కి పోతోంది. మీ యూనివర్సిటీలో ఏదో కాన్ఫరున్సు ఉందన్నారు. అమెరికా నుండీ, రష్యా నుండీ ఎవరో ప్రొఫెసర్లు వస్తున్నారు, వాళ్లని కలుసుకోవాలని అనుకుంటున్నారు. లేవండి." రాధ కంగారుగా భర్తని లేపింది.

సిలోన్ రేడియోలో వస్తూన్న సంగీత కార్యక్రమం సన్నగా వస్తోంది.

"ఏమీ కంగారు పడకమ్మా! రాధమ్మా! నిన్న రాత్రి ఆంజనేయస్వామి కోవెలలో యంత్రం వేసి జపం చేసేను. ఈ తావీజు చిన్నబాబు మెళ్లో వేసుకున్నాడంటే అన్నీ సర్దుకుంటాయి. వాయుపుత్రుడు గట్టి వాడమ్మోయ్. నా యంత్ర మహిమ వల్ల ఆ అంజనేయుడు అబ్బాయిలో ప్రవేశించి 'యంత్రం, యంత్రం' అనిపిస్తున్నాడమ్మా. ఇంక చిరంజీవికి గండం గడచినట్లే...."

అవధాని ఏదో ఊక దంపుడు ఉపన్యాసం లాగించేస్తున్నాడు.

"చెప్పే వాడికి వినే వాడు లోకువ. చెప్పే వాడు గడ్డి తింటే తిన్నాడు. వినే వాడి బుద్ధి ఏమైనట్లు. అయినా ఎవరి పిచ్చి వారికి ఆనందం. కానివ్వండి, కానివ్వండి..." అనుకుంటూ మిడతంభొట్లు మేష్టారు ఆంధ్రా యూనివర్శిటీ వైపు అడుగులు వేసేరు.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 17 జూలై 1970లో ప్రచురితం. ఒక కథ కాని కథని మినహాయిస్తే ఇదే నేను మొట్ట మొదట రాసిన కథ, 'సైన్సు ఫిక్షన్' కథ. అది నా శ్రీమతి ఇండియా వెళ్లిన సమయం. స్వయంపాకం చేత కాక వేరుశనగ కాయలు తిని కడుపునింపుకున్నాను ఒక రోజు. వేరుశనగ ఎక్కువ తినడం వల్ల పైత్యం చేసినట్లు అయింది. తల తిరిగింది. మంచం మీద పడుక్కుంటే ప్రపంచమే గిర్రున తిరిగింది. పక్క మీద నుండి తేలి పోయిన అనుభూతి కలిగింది. అదే ఈ కథకి నాంది అయింది.)